క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



డోర్నకల్ : అంగన్‌వాడీ కార్యకర్తలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ లక్ష్మికి మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా మారిన వారికి వెంటనే ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లీలాదేవి, సరోజ, విక్టోరియా పద్మ, అరుణ, లక్ష్మిపార్వతి తదితరులు పాల్గొన్నారు.

బంగారు హారం బహూకరణ



గార్ల : మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి వారికి గార్లకు చెందిన పరుచూరి కుటుంబరావు, కనకలక్ష్మి దంపతులు గురువారం రూ.1.50 లక్షల విలువ గల బంగారు హారాన్ని బహూకరించారు. బంగారు హారాన్ని ఆలయ అర్చకుడు అచ్యుతాచార్యులకు దాతలు అందజేశారు.

ఆవిష్కరణ ఎప్పుడో?



మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొమురం భీం విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం కొమురంభీం వర్ధంతిని పురస్కరించుకొని ఆవిష్కరణ చేస్తారని ఆదివాసులు, గిరిజన నాయకులు ఎదురుచూసిన ఫలితం లేక పోయింది.

యువతి అదృశ్యం

డోర్నకల్ : మండలంలోని హూన్యాతండా శివారు రాముతండాకు చెందిన ఓ యువతి అదృశ్యమైంది. డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం హూన్యాతండాకు చెందిన బానోత్ శ్యామల ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన కూతురి ఆచూకి తెలియక పోవడంతో తండ్రి రాంసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



కురవి : మండల కేంద్రంలోని రైతు ఈర్ల కృష్ణకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందింది. గేదె మేత కోసం బయటకు వెళ్లగా, విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతు కృష్ణ వేడుకుంటున్నాడు.

అనారోగ్యంతో ఆంబోతు..

గార్ల : మండలంలోని మూడుతండాకు చెందిన ఆంబోతు అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆంబోతుకు అంత్యక్రియలు నిర్వహించారు.

భగీరథ పైపునకు మరమ్మతు



డోర్నకల్ : జోగ్యాతండా సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వ పక్కన పగిలిన పైపునకు గురువారం మిషన్ భగీరథ సిబ్బంది మరమ్మతు చేశారు. ఎస్సారెస్పీ కాల్వ గండి పూడ్చివేత పనులు జరుగుతుండగా రెండు రోజుల క్రితం భగీరథ పైపు పగిలింది. దీంతో నీరంతా వృథాగా పోవడంతో ముల్కలపల్లి వైపు తాగునీటి సరఫరా నిలిచింది. పైపు పగలడంపై పత్రికలలో కథనాలు ప్రచురితం కావడంతో సిబ్బంది మరమ్మతు పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు.

పాఠశాలలో చోరీకి యత్నం

● పట్టించుకోని పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సింగారం ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నెల 11వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆఫీస్ రూమ్ తలుపులు నెట్టి, తాళంతీసి లోపలికి ప్రవేశించి లైబ్రరీ పుస్తకాలను చిందర చేసి, గదిలో ఉన్న అద్దాన్ని పగులగొట్టారు. పాఠశాలలో చోరీకి యత్నం సంఘటనపై హెచ్ఎం చంద్రమౌళి మహబూబాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఈ నెల 12వ తేదీ ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించలేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు



మరిపెడ రూరల్: టిలావత్‌తండాలో పట్టుబడిన గుడుంబా తయారీ సామగ్రి



కురవి: అవగాహన కల్పిస్తున్న సీరోలు ఎస్సై నగేశ్

కురవి : గుడుంబా తయారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో గురువారం గోపతండాలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీరోలు ఎస్సై సీహెచ్. నగేశ్ తెలిపారు. అలాగే కురవి మండలం జగ్యా తండా, రేకుల తండాలో కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

నర్సింహులపేట : మండలంలోని కొమ్ములవంచ శివారు రూప్లాతండాలో గురువారం ఎస్సై మాలోత్ సురేష్ అధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. 10 లీటర్ల గుడుంబా, 40 కేజీల నల్ల బెల్లం, 400 లీటర్ల బెల్లం పానం లభ్యం కాగా, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం గాలివారిగూడెం పరిధిలోని టిలావత్ తండాలో గుడుంబా స్థావరాలపై ఎస్సై సతీష్, సంతోష్‌ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సాలార్ తండా, కొమ్ముగూడెం తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించి 25 లీటర్ల గుడుంబా, 50 కిలోల నల్లబెల్లం, 30 కిలోల పటిక స్వాధీనం చేసుకుని, 280 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, టౌన్, రూరల్ ఎస్సైలు భీమారెడ్డి, దీపిక, ఆర్ఎస్సై సునంద, ఏఎస్సై సూరయ్య, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ రెడ్డి, కానిస్టేబుళ్లు సురేందర్, రాందాస్, అశోక్, రాజు, కిషన్, నాగరాజు, రమేష్ చందర్, భజన్ లాల్, ఉమా హైమ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్ : మండలంలోని దుబ్బ తండా, భీముడు తండాలో గుడుంబా స్థావరాలపై రెండో ఎస్సై రాంజీనాయక్, పోలీసులు గురువారం దాడులు చేశారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, గుడుంబాను స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేశారు.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎస్.సావిత్రి, పెంకుతండాకు చెందిన భూక్య కోమటి వద్ద 50 లీటర్ల నాటుసారా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఇరువురిపై కేసు నమోదు చేశారు.

నెల్లికుదురు : మండలంలోని హనుమాన్ నగర్ పంచాయతీ శివారు భూక్య ధాన్య తండా, మీత్యతండా శివారు పంతుల తండాలో గుడుంబా స్థావరాలపై ఎస్సై చిర్ర రమేష్ బాబు, పోలీసు సిబ్బందితో కలసి దాడులు చేశారు. భూక్య సుగుణ వద్ద 8లీటర్లు, 100లీటర్ల బెల్లం పానకం, భూక్య వీరన్న వద్ద 6లీటర్ల గుడుంబా, 50 లీటర్ల బెల్లం పానకం పట్టుబడినట్లు తెలిపారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేసముద్రం : మండలంలోని రంగాపురంలో ఎస్సై మురళీధర్‌రాజు ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డోర్నకల్ : మండలంలోని తెల్లబండతండాలో గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. డోర్నకల్ సీఐ బి.రాజేష్, ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి సుమారు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.

దంతాలపల్లి : మండలంలోని వాల్యా తండా పంచాయతీలో గుడుంబా స్థావరాలపై దాడి నిర్వహించి 15 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజు తెలిపారు.

చిన్నగూడూరు : మండలంలోని ఉగ్గంపల్లి శివారు మంచ్యా తండాలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడి చేసి 10 లీటర్ల నాటుసారా, 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఝాన్సీ తెలిపారు.

ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుంది

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు : బడుగు, బలహీన వర్గాల ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 12మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ క్రమంలో ఎంపీ వర్గం నాయకులు, కార్యకర్తలు కొందరు ఇందిరమ్మ కమిటీలను గ్రామంలో కాంగ్రెస్ నాయకులకు సమాచారం లేకుండా ఎవరికి వారే కమిటీలు వేసుకుని ఎమ్మెల్యే వద్దకు పంపించారంటూ ఆందోళన చేస్తు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, పట్నంశెట్టి నాగరాజు, బాలాజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వర్గమని చిన్నచూపు చూస్తే సహించేదీ లేదు

ఎంపీ వర్గమని ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎమ్మెల్యే వర్గం నాయకులు చిన్న చూపు చూస్తే సహించేది లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే నెల్లికుదురులో జరిగే సమావేశాలకు ఎంపీ వర్గమని తమను పిలువకుండా అవమాన పరుస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంగా కమిటీలను ఎన్నుకోవాలి



గూడూరు: వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బయ్యారం : ప్రజాస్వామ్యంగా ఇందిరమ్మ కమిటీని ఎన్నుకోవాలని కోరుతూ గురువారం బయ్యారంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ మైదాన కమిటీ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు ఆర్.భిక్షం, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు తుడుం వీరభద్రంలు మాట్లాడారు. నాయకులు రాకేష్, తిరుమలేష్, లింగమల్లు, భూషణ్‌రావు, రమేష్, మంగీలాల్, మహేష్, భగవాన్, హనుమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా కమిటీ నియమించాలి

గూడూరు : ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను గ్రామసభలో ప్రజల సమక్షంలో నియమించాలని బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి నూకల సురేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులతో పాటు పలు గ్రామాలకు చెందిన వారు మాట్లాడారు. నాయకులు కతార్‌సింగ్, రహీంపాష, కుమారస్వామి, బోడ బాలు, బోడ ఎల్లయ్య పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక కమిటీల ఏర్పాటును నియమ నిబంధనల ప్రకారం ఎన్నుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవం



జెండాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు బేతోలులో గ్యార్మీ షరీఫ్ (జెండా పండుగ) ఉత్సవాలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్యార్మీ జెండాలను చేత పట్టుకుని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. 11వ ఉర్సు సందర్భంగా కందిల్ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి చాదర్, సందల్, ఖందిల్, జెండాలను తీసుకువచ్చి మహబూబ్ సుభాని ఖాదర్ బాబా దర్గాలో సమర్పించి, ప్రార్థనలు నిర్వహించారు.

నేడు ఉర్సు ఉత్సవాలు...

హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గల ఉర్సు గుట్టపై ముస్లింలు మహబూబ్ సుభాని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు (ఫాతిహా) చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. గౌసియా పాక్ దర్గా వద్ద ఉన్న జెండా గద్దె వద్ద ప్రార్థనలు కార్యక్రమం నిర్వహించి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఓంకార్ ఆశయాలను కొనసాగిద్దాం



ఓంకార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గూడూరు : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత మద్దికాయల ఓంకార్ ఆశయసాధనకు కృషి చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ ఆధ్వర్యంలో ఓంకార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బందెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు, ఈసం రామయ్య, సత్తయ్య, శ్రీరామ్, నవీన్, రాములు పాల్గొన్నారు.

ఓంకార్ వర్ధంతి

కేసముద్రం : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్, జ్యోతిరావుపూలే సెంటర్‌లలో ఓంకార్ వర్ధంతిని ఎంసీపీఐ, ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా నిర్వహించారు. ఎంసీపీఐ మండల కన్వీనర్ మర్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్చానాయక్, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, మండల కార్యదర్శి సలీం, రమేష్, వేల్పుల వెంకన్న, సీతారాములు, లకావత్ రవి పాల్గొన్నారు.

సత్తయ్య ఆశయ సాధనకు పాటుపడాలి

● ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నివాళులర్పిస్తున్న కూనంనేని తదితరులు

కురవి : నెల్లూరి సత్తయ్య ఆశయ సాధన కోసం పాటుపడాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని బలపాల గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వర్‌రావు తండ్రి సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం సత్తయ్య దశదినకర్మకు హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, నల్లు సుధాకర్‌రెడ్డి, ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శి పోటుప్రసాద్, బి.హేమంతరావు, ముండ్ల ప్రసాద్, మలేడి కోటయ్య, నామ సైదులు, రవి, వెంకటేశ్వర్లు, పిట్టల వెంకన్న పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి



కురవి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కిసాన్ పరివార్ సంస్థ కృషి చేస్తోందని కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ అన్నారు. గురువారం సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రూ.3లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. 15 ఫ్యాన్లు బహూకరించారు. సీరోలు ఏకలవ్య పాఠశాల తాగునీటి పైపులైన్ కోసం రూ.2లక్షల నిధులు ఇవ్వడానికి హామీ ఇచ్చారు.

గ్యాస్ వినియోగదారుల నిరసన



కేసముద్రం : గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని మండలంలోని ధన్నసరిలో పలువురు వినియోగదారులు గురువారం గ్యాస్ సిలిండర్‌లు సరఫరా చేసే వాహనం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ గ్యాస్ ఏజెన్సీకి సిలిండర్ బుక్ చేసుకుని నాలుగు నెలలు కావొస్తున్నా, తమకు గ్యాస్ సిలిండర్‌లను ఇవ్వడంలేదని ఆరోపించారు. అదే విధంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 150 ఖాళీ సిలిండర్‌ను తీసుకెళ్లారని వారు ఆరోపించారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



మహబూబాబాద్ అర్బన్ : నివాళులర్పిస్తున్న దోలి సత్యనారాయణ, విద్యార్థులు



నెహ్రూసెంటర్: నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్ : మహనీయులను ఆదర్శంగా తీసుకోని నేటితరం యువత ముందుకు సాగాలని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. గురువారం జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ జయంతి, కొమరంభీం వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వడుప్సా బాధ్యులు పరమాత్మచారి,కౌన్సిలర్ ఎండీ. ఫరీద్, ప్రిన్సిపాల్ శ్రీపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమురంభీంకు ఘన నివాళి

గంగారం : మండలంలోని పలు గ్రామాల్లో కొమురంభీం వర్ధంతిని గురువారం నిర్వహించారు.మడగూడెంలో, కోమట్లగూడెం గ్రామంలోని కాళోజీ గ్రంథాలయంలో కొమురంభీం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్ : అడవి బిడ్డల హక్కుల కోసం ఉద్యమించిన కొమురం భీం వర్ధంతిని మండలంలోని బూరుగుపాడులో నిర్వహించారు.నాయకపోడు సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను కొమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కొమురంభీం వర్ధంతిని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాంమూర్తి, ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు శివవర్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించుకుందాం'



మరిపెడ: సమావేశంలో మాట్లాడుతున్న రవి


మరిపెడ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కోరారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మరిపెడలోని సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, విద్యారంగ అభివృద్ధిలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి సమర్థుడన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధానకార్యదర్శి యాకూబ్, కార్యదర్శి నందిగామ జనార్ధనాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవర్ధన్, ప్రభాకర్‌లు, శ్రీనివాసరావు, యాకయ్య, నాగరాజు, మంగు, దేవ్లా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

మహబూబాబాద్ అర్బన్ : ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్, జనార్ధన్ చారి, మండలాల నాయకులు పాల్గొన్నారు.

'మా పిల్లలను బడికి రానివ్వండి'

● మూడేళ్లుగా అందని బెస్ట్ అవైలబుల్ నిధులు



మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబాబాద్ అర్బన్ : తమ పిల్లలను ప్రైవేట్ బడికి రానివ్వండని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన శాఖ కార్యాలయం ఎదుట బెస్ట్ అవైలబుల్ స్కీంకు ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ..తొర్రూరులోని ప్రైవేట్ పాఠశాల లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద సుమారు 60మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. దసరా సెలవులు ముగిసిన తర్వాత తమ పిల్లలను పాఠశాలకు అనుమతి ఇవ్వడం లేదని, దీనిపై పాఠశాల యాజమాన్యంను అడిగినందుకు తమకు మూడేళ్ల నుంచి బిల్లులు రావడం లేదని అందుకు విద్యార్థులను పాఠశాలకు అనుమతించడం కుదరదన్నారు. కలెక్టర్, గిరిజన శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాందాస్, రాంచరణ్, సారయ్య, రాము, విజయ్, ప్రవీణ్, వీరన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తి శ్రద్ధలతో సుదర్శన యజ్ఞం

మహబూబాబాద్ రూరల్ : పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకులు గురువారం సుదర్శన యజ్ఞం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలపై సుదర్శన భగవానుడి సన్నిధిలో అర్చన చేసి యజ్ఞం పూర్ణాహుతి చేశారు.

గాలికుంటు నివారణకు టీకాలు

నర్సింహులపేట : మండలంలోని కౌసల్యదేవిపల్లిలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. 250 ఎద్దులు, ఆవులు, 105 గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సౌమ్యచందర్ తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వీరన్నయాదవ్

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

నర్సింహులపేట : ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంఈఓ రామ్మోహన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని కొమ్ములవంచ యూపీఎస్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులతో మాట్లాడారు.

మార్వాడీల శరద్ పౌర్ణమి వేడుకలు

మహబూబాబాద్ రూరల్ : శరద్ పౌర్ణమి వేడుకలను జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రాధాకృష్ణుల సన్నిధిలో దాండియా నృత్యాలు, భజనలు చేసి పాటలు ఆలపించారు.

మొక్కలతోనే ఆహ్లాదకర వాతావరణం

మరిపెడ రూరల్ : మొక్కల పెంపకంతోనే ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని మరిపెడ ఫారెస్ట్ రేంజ్ అధికారి రవీందర్ అన్నారు. గురువారం 4 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

మోదీ సర్కారును సాగనంపాలి

గూడూరు / కొత్తగూడ : దేశ సంపదను కార్పొరేట్ రంగానికి కట్టబెడుతున్న కేంద్రంలోని మోదీ సర్కారును సాగనంపాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ప్రధాన కార్యదర్శి బిళ్లకంటి సూర్యం అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేకశంలో వారు మాట్లాడారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు.

పరీక్షలకు సన్నద్ధం చేయాలి

మహబూబాబాద్ రూరల్ : ఎస్ఏ-1 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మందుల శ్రీరాములు అన్నారు. సోమ్లు తండా ఎంపీపీఎస్‌ను శ్రీరాములు గురువారం సందర్శించారు.

ఎన్నిక

గార్ల : సీపీఎం పట్టణ కార్యదర్శిగా కుంట రామకృష్ణను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

నర్సింహులపేట : ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్సై మాలోతు సురేష్ సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఫోన్లను వెతికి ఐదుగురికి గురువారం అందజేశారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

గూడూరు : మండలంలోని బొల్లెపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జమ్ముల కృష్ణారెడ్డి వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన సతీమణి జమ్ముల హేమలతారెడ్డి హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

కళాజాతా

పెద్దవంగర : మూఢనమ్మకాలను రూపుమాపాలని ఎస్సై క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని బొమ్మకల్లులో పోలీస్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు.మూఢనమ్మకాలు, గుట్కా, చెడు వ్యసనాలు, బాల్య వివహాలు సామాజిక రుగ్మతులపై అవగాహన కల్పించారు.

ఘనంగా షోయబుల్లాఖాన్ జయంతి



నెహ్రూసెంటర్ /మరిపెడ / కురవి/ గార్ల : కలం యోధుడు షోయబుల్లాఖాన్ జయంతిని ఆయా మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనపై అక్షరాలతో ఎక్కుపెట్టిన షోయబుల్లాఖాన్ గొప్ప యోధుడని కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, మరిపెడ మండల అధ్యక్షుడు సత్తార్‌పాష, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రియాజ్ పాషా, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా నాయకుడు షేక్ బుడాన్, టీయూడబ్ల్యూజే (143) యూనియన్ జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య తదితరులు ఉన్నారు.